క్లుప్తంగా

గొల్లలపాలెంలో ఉచిత పశువైద్య శిబిరం



రైతులకు మందులు అందజేస్తున్న పశువైద్యాధికారి

మునగపాక : గొల్లలపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. మేకలు, గొర్రెలు అనారోగ్యానికి గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలు, సీజనల్ వ్యాధుల పట్ల రైతులకు పశువైద్యాధికారి లావేటి ప్రదీప్ కుమార్ అవగాహన కల్పించారు. సకాలంలో పశువులకు నట్టల నివారణ మందులు, టానిక్‌లు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

భూ సర్వేతో రైతులకు మేలు

మాకవరపాలెం: జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో నిర్వహిస్తున్న భూ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తహసీల్దార్ ప్రసాదరావు అన్నారు. మండలంలోని పాపయ్యపాలెంలో బుధవారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 8 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. ప్రస్తుతం జడ్.గంగవరం, శెట్టిపాలెం, బయ్యవరం, పెద్దిపాలెం, జి.గంగవరంలో సర్వే జరుగుతుందన్నారు. మిగిలిన గ్రామాల్లో డ్రోన్ సర్వే చేపట్టామని, ఇది పూర్తికాగానే రీ సర్వే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో లక్ష్మణరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గింజర్తిలో 3న ఉచిత కంటి వైద్య శిబిరం

గొలుగొండ: మండలంలోని గింజర్తి గ్రామంలో ఈనెల 3న ఉచిత కంటి వైద్య శిబిరం జరగనుంది. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సిబ్బందితో పాటు పంచాయతీ పాలకులు తెలిపారు. చుట్టు పక్కల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటల నుండి శిబిరం జరుగుతుందన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యసేవలు



గెడ్డపాలెంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎస్.రాయవరం : ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్‌తో వైద్య సదుపాయాలు మరింత మెరుగ్గా అందుతాయని క్లస్టర్ సీహెచ్‌వో ప్రశాంతి అన్నారు. గెడ్డపాలెం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ క్లినిక్ నిర్వహించారు. గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి ఇకపై ప్రతి నెలా గ్రామంలో చెకప్‌లు చేసి , వ్యాధులు నయం చేసే కార్యక్రమం చేపడతామన్నారు.104 వాహనంలో ఇచ్చే మందులతో పాటు ఇప్పుడు గ్రామంలో వైద్యులు వచ్చి తనిఖీ చేసి అవసరమైన మందులు ఇస్తామన్నారు. బుధవారం వైద్య శిబిరం 48 మంది రోగులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోన లక్ష్మణ్

అనకాపల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండలంలోని మూలపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం దశాబ్దాల నుంచి పోరాటం కొనసాగుతోందన్నారు. ఏఐటీయుసీ నాయకత్వంలో గతంలో సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. సంక్షేమ బోర్డు అమలులోనికి వస్తే కార్మికులకు ఎన్నో సంక్షేమ పథకాలు, సదుపాయాలు అందుతాయని చెప్పారు. సమావేశంలో ఆలం శంకర్, చిన్ని, చిన్న, మారేడిపూడి సత్యనారాయణ నర్సింగరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు విస్తృత ప్రచారం



మునగపాకలో ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ విజయం కోరుతూ ప్రచారం చేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ



కైలాసపట్నంలో ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



ఉద్దండపురంలో పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

మునగపాక : ఉత్తరాంధ్ర అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ(తేజ) పిలుపునిచ్చారు. మునగపాకలో ఆయన బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుకుమారవర్మ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్మాత్మకంగా ఎమ్మెల్సీ ఎన్నికలను తీసుకువచ్చారన్నారు. అన్ని వర్గాల నుంచి మంచి మెజార్టీతో సుధాకర్ విజయం సాధించడం ఖాయమన్నారు. విశాఖ త్వరలో పరిపాలనా రాజధానిగా రాబోతుందన్నారు. తద్వారా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలుంటాయన్నారు. యువకులు, మేధావులు, విద్యావంతులు ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, మార్కెట్‌కమిటీ చైర్ పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, సచివాలయ మండల కన్వీనర్ పొలిమేర గణేష్, మునగపాక సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహన రావు, పార్టీ నేతలు కొయిలాడ జగదీష్, సంతోష్‌కుమార్, ఆడారి కాశీబాబు పాల్గొన్నారు.

సీతంరాజుకు మద్దతుగా ప్రచారం

కోటవురట్ల : వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పిలుపునిచ్చారు. కైలాసపట్నంలోని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి నివాసంలో పట్టభద్రులతో బుధవారం సమావేశమై ఓటు వేయాలని కోరారు. అభ్యర్థి తరఫున ప్రచార పత్రాలు పంపిణీ చేసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర ప్రజలపై ఎంతో ప్రేమాభిమానాలు పంచుతున్నారని, విశాఖను పరిపాలనా రాజధానిగా చేయడం ద్వారా ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. అతి తొందరలోనే విశాఖలో పరిపాలన ప్రారంభం కానుందని, ఈ తరుణంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను మంచి మెజార్టీతో గెలిపించి సీఎంకు కానుకగా ఇవ్వాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి మాట్లాడుతూ విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉండేలా మంచి గెలుపును అందివ్వాలన్నారు. ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులను సమాయత్తం చేసి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసేలా పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు పి.నూకరత్నం, జి.పావని, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, శెట్టి రమణ, అయ్యపురెడ్డి బాబ్జీ, బాలేపల్లి సత్యనారాయణ, పైల నాని, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్దండపురంలో ప్రచారం

నక్కపల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు బుధవారం ఉద్దండపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యతా ఓటు సీతంరాజు సుధాకర్‌కు వేయాలన్నారు. ఉత్తరాంధ్రవాణి శాసన మండలిలో వినిపించడంతోపాటు, సమస్యల పరిష్కారానికి సుధాకర్ కృషి చేస్తారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి బలపరచిన అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించడం ద్వారా మళ్లీ వైఎస్సార్‌సీపీ సత్తా చాటాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సుమారు 2 లక్షల సచివాలయ ఉద్యోగాలు నియామకం చేపట్టి నిరుద్యోగ సమస్య పరిష్కరించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. చట్టసభల్లో తగినంత సఖ్యాబలం ఉంటే ఏ అభివృద్ధి అయినా చేయొచ్చన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శీరం నర్సింహమూర్తి, లొడగల చంద్రరావు, బొల్లం బాబ్జి, పోతంశెట్టి రాజేష్, నల్లల రామకృష్ణ, చొప్పా శ్రీను పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

రాంబిల్లి : ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, ధూళి నాగరాజు , మండల సచివాలయ కన్వీనర్ కావిరి రామకృష్ణ కోరారు. బుధవారం వీరు మురకాడ, కట్టుబోలు, మర్రిపాలెం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.



మర్రిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

వెంకన్న ఆలయ నిర్మాణానికి భూమిపూజ



తిమ్మరాజుపేటలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

మునగపాక : తిమ్మరాజుపేటలో బుధవారం కలియుగ దైవం వేంకటేశ్వరుని ఆలయ నిర్మాణానికి డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌లు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరుచుకోవాలన్నారు. ఆలయ నిర్మాణానికి స్థలం సమకూర్చిన శరగడం రామేశ్వరరావును అభినందించారు. డాక్టర్ విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ మంగలక్ష్మి, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, గొట్టుముక్కల వాసు, రామభద్ర నాయుడు, దివాకర్, ఆడారి గణేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువకుడిని హత్య చేసిన వారిని అరెస్టు చేయాలి



పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పాయకరావుపేట : మండలంలో గల పీఎల్ పురం గ్రామంలో దళిత యువకుడైన వడ్లమూరి వీర నాగేంద్రను హత్య చేసిన వారిని పోలీసులు తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. నాగేంద్రను హత్య చేసి, తాళ్లతో కాళ్లు, చేతులు కట్టేసి, బావిలో వేయడం కిరాతకం అని పలువురు దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్, అంబేద్కర్ ఇండియా విషన్ ప్రతినిధి కె.దిలీప్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్‌లు పోలీసుస్టేషన్ ఎదుట మృతుడు నాగేంద్ర బంధువులతో కలిసి ఆందోళన చేశారు. పాయకరావుపేట, నక్కపల్లి సీఐలకు ఫిర్యాదు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా సీఐలు ఆందోళన కారులతో మాట్లాడుతూ నాగేంద్ర హత్యపై దర్యాప్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. మృతుడు నాగేంద్ర ఫోన్‌కాల్స్ ఆధారంగా విచారణ చేయడం జరుగుతుందన్నారు. విచారణకు సహకరించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహిస్తే మరికొన్ని విషయాలు తెలుస్తాయన్నారు.

ఇప్పటికే అనుమానితులను అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేసిన వారిలో జిల్లా దళిత నాయకులు పల్లా విలియం కేరి, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వడలి శివప్రకాష్ ఉన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



ఉమ్మలాడలో పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ శ్రీనివాసరావు

మునగపాక : ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మలాడ సచివాలయ కన్వీనర్ సూరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని ఉమ్మలాడలో బుధవారం ఆయన అర్హులైన లబ్ధిదారులకు ఆయన పింఛన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అందరి హృదయాల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు.

అయ్యన్నపాలెంలో ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు



అయ్యన్నపాలెంలో ఆర్‌వోప్లాంటును ప్రారంభిస్తున్న హెటెరో ప్రతినిధులు

నక్కపల్లి : ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు తమ వంతు ఆర్థిక సాయం చేస్తున్నామని హెటెరో కంపెనీ డీజీఎంలు ప్రభాకర్, కుళ్లాయిరెడ్డి , సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలో ఉపమాక శివారు అయ్యన్నపాలెంలో రూ.13 లక్షలతో హెటెరో కంపెనీ ఏర్పాటు చేసిన ఆర్‌వోప్లాంట్‌ను వారు ప్రారంభించారు. కంపెనీ సీఎస్ఆర్ నిధులతో ఈ ప్లాంటు ఏర్పాటు చేసామన్నారు. కంపెనీ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు కనీస అవసరాలు తీర్చేందుకు యాజమాన్యం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కురందాసు నూకరాజు, కంపెనీ సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండ చుట్టూ ప్రహరీ వద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాంబిల్లి: తమ గ్రామాన్ని ఆనుకొని వున్న కొండను ఆనుకొని నేవీ నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనులను నిలిపివేయాలని వై.లోవ గ్రామస్తులు ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ పి.భాగ్యవతికి వినతి పత్రాలు అందజేశారు. ఈ కొండపైకి వెళ్లకుండా ప్రహరీ గోడ నిర్మిస్తే తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని సర్పంచ్ బద్ది నారాయణరావు, మాజీ సర్పంచ్ బి.నారాయణరావుతో పాటు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కొండ ప్రాంతం నుంచి పొలాల్లోకి వెళ్లే మార్గం వుందని, పశువుల మేతకు ఈ కొండ ఉపయోగపడుతుందని , వరదలు వచ్చినపుడు కూడా ఈ కొండపై పశువులను వుంచుతామని తెలిపారు. ఈ కొండను విడిచిపెట్టాలని కోరారు.

నియోజకవర్గంలో 42వేలమందికి రైతు భరోసా

- నాలుగు విడతల్లో రూ.211 కోట్లు జమ
- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల



చిక్కాల రామారావు

నక్కపల్లి : పాయకరావుపేట నియోజకవర్గంలో 42 వేల మంది రైతులకు రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందించడం జరిగిందని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాలుగు విడతల్లో సుమారు రూ.211 కోట్లు రైతుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నాలుగు విడతలుగా నిరాటంకంగా రైతులకు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయంగా అందించడం జరుగుతోందన్నారు. కరోనా సంక్షోభ సమయంలో కూడా రైతులకు ఇవ్వాల్సిన సాయాన్ని విడుదల చేసారన్నారు. నక్కపల్లి మండలంలో 11893 మంది రైతులకు రూ.60.48 కోట్లు, పాయకరావుపేట మండలంలో 7483 మందికి రూ.39.48 కోట్లు, ఎస్‌రాయవరం మండలంలో 11712 మందికి రూ.58.42 కోట్లు, కోటవురట్ల మండలంలో 10926 మందికి రూ.52.73 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. 316 మంది కౌలు రైతులకు కూడా రైతుభరోసా పీఎం కిసాన్ ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. నక్కపల్లి మండలంలో 12 మందికి, కోటవురట్ల మండలంలో 112మందికి, ఎస్.రాయవరం మండలంలో 34 మందికి, పాయకరావుపేట మండలంలో 158 మందికి ఇవ్వడం జరిగిందన్నారు. ఇక వివిధ కారణాల వల్ల రైతు భరోసా సొమ్ము వారి ఖాతాల్లో జమకాని వారు తిరిగి అర్జీపెట్టుకుంటే వాటిని కూడా పరిశీలించి 228 మందికి చెల్లించడం జరిగిందన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పొంది సాగు చేసుకుంటున్న 215 మందికి రైతు భరోసా సాయం కింద రూ.43 లక్షలు చెల్లించడం జరిగిందన్నారు. గత ఏడాది డిసెంబరులో భారీ వర్షాలు, తుఫాను వల్ల నష్టపోయిన వారికి పాయకరావుపేట మండలంలో ఏడుగురికి రూ.76వేలు, ఎస్.రాయవరం మండలంలో 21 మందికి రూ.1.04 లక్షలు ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. ఈ ఏడాది రైతు భరోసా సొమ్ము జమ కాని రైతులు ఉంటే ఆర్‌బీకేల ద్వారా అర్జీ పెట్టుకుంటే పరిష్కరించి రైతు భరోసా సొమ్ము జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

ఉప్పవరంలో అభివృద్ధి పనులు ప్రారంభం



కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ రావి నాగలక్ష్మి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఉప్పవరం గ్రామంలో బుధవారం పాఠశాల ముందు ప్లాట్‌ఫాం నిర్మాణ పనులు ఎంపీటీసీ రావి నాగలక్ష్మి కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఎంపీటీసీ నిధులు మూడు లక్షల రూపాయలతో ఈ పనులను చేపట్టనున్నారు. రావి శోభన్‌బాబు, మాజీ సర్పంచ్ చిన్ని శ్రీనివాసరావు, చిన్ని సత్యారావు, మాలక్ష్మినాయుడు, పల్లి శ్రీను, దరియా, గంగిరెడ్డి భాస్కర్, కాయల శ్రీను పాల్గొన్నారు.

జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడికి సత్కారం

కోటవురట్ల: కె.వెంకటాపురంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు శాలువతో సత్కరించి అభినందించారు. కేక్ కట్ చేసి సంబరం జరిపారు. సర్పంచ్ శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ తమ గ్రామం నుంచి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడుగా ఎంపికవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేష్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల నాని, మాజీ సర్పంచ్ పైల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

మునగపాక : మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీడీవో పి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

రహదారి నియమాలు పాటించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): రహదారిపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, రహదారి నియమాలను పాటించాలని విద్యార్థులు నినదించారు. అచ్యుతాపురం మండల కేంద్రం ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో భాగంగా విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దేవరాయలు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

విజయ దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పనులు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం హరిగిరిపై విజయదుర్గమ్మ వారి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

నేడు నూకాంబిక అమ్మవారి అనుపు మహోత్సవం



మార్టూరు నూకాంబిక అమ్మవారు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మార్టూరులో వెలసిన నూకాంబిక అమ్మవారి అనుపు మహోత్సవం ఈ నెల 2న నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కె.కె. శ్రీనుబాబు తెలిపారు. ఉత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



యాగశాల ప్రవేశ కార్యక్రమంలో భక్తులు

రాంబిల్లి : కొత్తపేటలో బుధవారం దుర్గాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత గణపతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యాగశాల ప్రవేశం ఇతర పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పురోహితులు నిర్వహించారు. సర్పంచ్ అరుణలత, గ్రామనాయకులు, భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 3న ఆలయ ప్రారంభం, దుర్గాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

నేడు మండల సమావేశం

యలమంచిలి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ సమవేశమందిరంలో జరుగుతోందని ఎంపీడీవో ప్రసాదరావు తెలిపారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన జరగనున్న ఈ సమవావేశానికి మండలస్థాయి అధికారులంతా ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

చవితి వేడుకలకు ముందస్తు సన్నాహాలు

అనకాపల్లిటౌన్: ఈ ఏడాది సెప్టెంబర్ 23న వినాయకచవితి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభిస్తున్నట్టు వినాయక సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకులు ఆడారి కుమారిస్వామి అన్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో వినాయక ప్రతిమలను తయారు చేసే శిల్పులను కమిటీ సభ్యులు బుధవారం కలిసి వారి సలహాలు, సూచనలు తీసుకున్నారు. అంతకుముందు శిల్పి పండూరి సత్యనారాయణకు వినాయక ప్రతిమను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొడుకుల శ్రీకాంత్, పి.సోమశేఖర్‌పట్నాయక్ , ఆడారి శ్రీనివాసరావు, తిమ్మాపాత్రుని జయసూర్య, మావూరి వెంకటేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న క్రాఫ్ట్ ఎగ్జిబిషన్



కశింకోటలో విద్యార్థులు తయారు చేసిన వస్తువులతో క్రాఫ్టు ఎగ్జిబిషన్



వ్యర్థ వస్తువులతో తయారు చేసిన బావి

కశింకోట : కశింకోటలోని కేంబ్రిడ్జి స్కూల్లో బుధవారం క్రాఫ్టు ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు వ్యర్థ వస్తువులు, రంగు కాగితాలతో అందంగా తయారు చేసిన వివిధ రకాల వస్తువులను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఇవి ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ విలాసన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీయడానికి, వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. అలాగే హానెస్టీ కౌంటర్ ఏర్పాటు ద్వారా విద్యార్థులను నిజాయితీ గల పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.